క్లుప్తంగా

'అమ్మ'కు గౌరవం



అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ భీశెట్టి సత్యవతి వేలాది మంది మహిళలకు 'అమ్మ'గా సుపరిచితురాలు. ఆ అమ్మకు పెందుర్తి మండలం ఎస్ఆర్పురంలో చక్కటి గౌరవం దక్కింది. ఓ ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సత్యవతిని ఎంపీపీ మధుపాద నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి సత్కరించారు. చీర, తాంబూళం ఇచ్చి గౌరవించారు. - పెందుర్తి

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. వెండి గరుడవాహనంపై స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని అధిష్టింపజేశారు. అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు



తహసీల్దార్కు వినతిపత్రం అందిస్తున్న ఇరువాడ గ్రామస్తులు

సబ్బవరం: మండలంలోని ఇరువాడ గ్రామంలో విలువైన ప్రభుత్వ భూమిని కాపాడడంతో పాటు కబ్జాకు పాల్పడివారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు కోరారు. దీనిపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో గ్రామానికి చెందిన సుమారు 60 మంది తహసీల్దార్ చలమయ్యకు ఫిర్యాదు చేశారు. కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇరువాడ రెవన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 103,106లలో 13.32 ఎకరాల భూమి ఉందన్నారు.దీనిలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేయడంతో పాటు లే అవుట్ వేసి అమ్ముకుంటున్నారన్నారు.తమ పక్క గ్రామం అనకపల్లికి చెందిన కాపుశెట్టి దుర్గాప్రసాద్,ఆయన సోదరుడు కాపుశెట్టి శేషుబాబు కబ్జాకు పాల్పడి భూమిలో తాటి చెట్లు,నేరేడు చెట్లు తొలగించి ప్రహరీ నిర్మిస్తున్నారన్నారు. ఫిర్యాదు చేసినవారిలో గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు,కర్రి నూకాలమ్మ,జట్టి పద్మ,మామిడి రమణమ్మ,మజ్జి లక్ష్మి,బలిరెడ్డి లక్ష్మి,బలిరెడ్డి కనకలక్ష్మి,కర్రి రమణమ్మ,మామిడి పెదలక్ష్మి,లంకి పార్వతి తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. లక్ష అందజేత



ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్న రాపేటి రాము

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ మందిరానికి నల్లరేగులపాలెం మాజీ సర్పంచ్ రాపేటి రాము రూ. లక్ష విరాళాన్ని సోమవారం రాయపుర అగ్రహారం సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుతో పాటు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ ప్రారంభోత్సవం ఈ నెల 17వ తేదీన చేపట్టనుండడంతో ఆహ్వాన పత్రికను అందజేశారు. విరాళం అందుకున్న వారిలో ఆలయ కమిటీ సభ్యులు నక్కెళ్ల అచ్చిబాబు, గూడెపు లోవరాజు, పిల్లల సాధుబాబు తదితరులు ఉన్నారు.

పెందుర్తిని మోడల్గా తీర్చిదిద్దుతున్నాం

- అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్రాజ్
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న ఎంపీ సత్యవతి, మేయర్ హరివెంకటకుమారి



ఎస్.ఆర్ పురంలో వంతెన పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యే అదీప్రాజ్

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గాన్ని మోడల్గా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా భావించి పని చేస్తోందన్నారు. జీవీఎంసీ 95వ వార్డు, పెందుర్తి గ్రామీణ ప్రాంతంలో అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.సత్యవతి, మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్రాజ్ సోమవారం పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలను పోటాపోటీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. 95వ వార్డులో ఒకే రోజు దాదాపు రూ.20 కోట్ల పనులకు ప్రారంభోత్సవం చేయడం ఆనందంగా ఉందన్నారు. అలాగే దశాబ్దాల కలగా మిగిలిపోయిన పెదగాడి-చింతగట్ల రహదారిని తమ ప్రభుత్వం పూర్తి చేసిందని గర్వంగా చెప్పుకుంటామన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు ప్రగతి ఫలాలు

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి ఫలాలు అందాలన్నదే తమ సంకల్పం అన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. రెండు నెలల్లో అధికారం చేపట్టిన తర్వాత మిగిలిన అభివృద్ధి పనులను శరవేగంగా చేపడతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఎంపీపీ మధుపాద నాగమణి అంజి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి కనకరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, రాష్ట్ర అయ్యారక వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, సర్పంచ్లు గనిశెట్టి వెంకటలక్ష్మి, గొరపల్లి శ్రీను, బొడ్డు చంద్రవాణి, కేసుబోయిన లావణ్య త్రినాథ్, ఎంపీటీసీలు నందవరపు అప్పలరాజు, జి.రమణ, నాయకులు ఉప్పిలి కనకరాజు, మధుపాద అంజి, బల్ల రాంబాబు, ఆకుల గుణాకర్, కేసుబోయిన త్రినాథ్, బొడ్డు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

95వ వార్డులో అభివృద్ధి పనుల వివరాలు

- చీమలాపల్లి వద్ద రూ.11.82 కోట్ల జీవీఎంసీ నిధులతో నిర్మించిన ఆధునిక డంపింగ్యార్డును మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే అదీప్రాజ్, కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు.
- రత్నగిరినగర్లో రూ.1.78 కోట్లతో నిర్మించిన స్పోర్ట్స్ థీమ్ పార్కును ఎమ్మెల్యే అదీప్రాజ్, కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.
- చినముషిడివాడ నుంచి రత్నగిరినగర్ వరకు రూ.19.90 లక్షలతో నిర్మించనున్న బాక్స్ కల్వర్టు పనులకు, శివాలయం నుంచి రత్నగిరినగర్ వరకు రూ.19.97 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.



చీమలాపల్లి వద్ద రూ.11.82 కోట్లతో నిర్మించిన డంపింగ్యార్డును ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కార్పొరేటర్ దేముడు

చింతగట్లలో..

- పెదగాడి నుంచి మేహాద్రి శీల గట్టు మీదుగా చింతగట్ల వరకు రహదారిపై చింతగట్ల వద్ద రూ.1.20 కోట్లతో నిర్మించిన వంతెన, చింతగట్లలో రూ.20.80 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ సెంటర్ను ఎమ్మెల్యే అదీప్రాజ్ ప్రారంభించారు.
- రూ.1.50 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

సరిపల్లిలో..

- రూ.41.10 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.8.67 లక్షలతో గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు.

సౌభాగ్యరాయపురంలో..

- రూ.27 లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న కల్వర్టుకు ఎంపీ డాక్టర్ భీశెట్టి సత్యవతి, ఎమ్మెల్యే అదీప్రాజ్ శంకుస్థాపన చేశారు.
- గ్రామంలో రూ.2.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, కేదారివానిపాలెంలో రూ.3 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ను ప్రారంభించారు.



సరిపల్లిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్రాజ్, ఏఎంసీ చైర్మన్ దేవిసాంబ

గుర్రంపాలెంలో:..

- రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.20.80 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ను, రూ.21.40 లక్షల నిధులతో అక్కిరెడ్డిపాలెంలో నిర్మించిన ఎఫ్హెచ్టీసీ కేంద్రాన్ని, రూ.8.67 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ఎమ్మెల్యే అదీప్రాజ్ ప్రారంభించారు.
- రూ.36.60 లక్షల నిధులతో నిర్మించనున్న ఎఫ్హెచ్టీసీ అదనపు భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

రాజయ్యపేటలో..

- గణపతి ఆలయంలో రూ.3.30 లక్షలతో ఏర్పాటు చేసిన స్టీల్ రైలింగ్ను, రాజయ్యపేటలో రూ.10.98 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, ఎస్సీ కాలనీలో రూ.26.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రెల్లి కాలనీలో రూ.7.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను ఎమ్మెల్యే ప్రారంభించారు. బందంవాని పాలెంలో రూ.కోటి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు.

వైఎస్సార్సీపీలో భారీ చేరికలు

చింతగట్లలో టీడీపీ, జనసేన నేతలను ఆహ్వానించిన ఎమ్మెల్యే అదీప్రాజ్



ఎమ్మెల్యే అదీప్రాజ్ సమక్షంలో పార్టీలో చేరిన చింతగట్ల పంచాయతీకి చెందిన జనసేన, టీడీపీ కుటుంబాలు

పెందుర్తి: మండలంలోని చింతగట్ల పంచాయతీలో టీడీపీ-జనసేనకు షాక్ తగిలింది. రాష్ట్ర అయ్యారక వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని 40 కుటుంబాలు వైఎస్సార్సీపీలో చేరాయి. సోమవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్రాజ్ పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా చెప్పారు.

విద్యకు సీఎం జగన్ పెద్దపీట

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్రాజ్
- పలు పాఠశాలల్లో నూతన భవనాలు ప్రారంభం



పరవాడ బీసీ కాలనీలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్రాజ్

పరవాడ: పేదలకు సైతం కార్పొరేట్ స్థాయి విద్య అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్రాజ్ అన్నారు. పరవాడ బీసీ కాలనీలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు, మండల పరిషత్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనంతో పాటు కలపాకలో రూ.14 లక్షతో నిర్మించిన ఎంపీపీ పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే అదీప్రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దామన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు మెరుగైన విద్యా బోధనకు చర్యలు తీసుకోవడం జరిగిందని చెప్పారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి అమ్మ ఒడి, విద్యా దీవెన పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ఇంగ్లిష్ మీడియం అందించి వారి భవిష్యత్ను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి సీఎం జగన్మోహన్రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతున్న సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అదీప్ రాజ్ అభినందించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, సింహాద్రి ఎన్టీపీసీ హెచ్ఆర్ హెడ్ బి.బి.పాత్ర, హెచ్ఆర్ డీజీఎం శ్రీమంత మహపాత్ర, సీఎస్సార్ మేనేజర్ కె.ప్రకాశరావు, ఎంపీడీవో కీర్తి స్పందన, ఎంఈవోలు సాయి శైలజ, దివాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, కలపాక సర్పంచ్ బొండా కనకారావు, ఎంపీటీసీ చప్పా ప్రభ, పరవాడ ఉప సర్పంచ్ బందారు రామారావు, నాయకులు బొద్దపు చిన్నారావు, పెదిశెట్టి శేఖర్, పైల అప్పలనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, పైల అప్పారావు, ఏఈ గండి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అజాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్కుమార్



హెవీ వాహనాల డ్రైవర్లు, యజమానులకు సూచనలిస్తున్న ఏసీపీ రాజీవ్కుమార్

సింహాచలం: అజాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్ అన్నారు. అడవివరం నుంచి గోపాలపట్నం మార్గంలో ఇటీవల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారులు మృతి చెందడంతో హెవీ వెహికల్ డ్రైవర్లు, యజమానులకు సింహాచలంలోని ఒక కల్యాణమండపంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. నిర్ణీత సమయంలో మాత్రమే అడవివరం మార్గంలో హెవీ వెహికల్స్కి అనుమతి ఉంటుందని, ఆసమయాల్లోనే రాకపోకలు సాగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. తద్వారా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్టు అంచనా వేశామన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో పశ్చిమ ట్రాఫిక్ సీఐ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అడవివరంలో చోరీ

10 తులాల బంగారం, అరకిలో వెండి అపహరణ



కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న క్రైం ఎస్ఐ సూర్యనారాయణ

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అడవివరంలోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి 10 తులాల బంగారం, అరకిలో వెండి అపహరించారు. వివరాలు.. అడవివరంలోని టీవీటవర్ కాలనీలో నేవల్ డాక్యార్డ్ రిటైర్డ్ ఉద్యోగి ఎస్పీఎస్ రామానుజమ్ నివసిస్తున్నారు. ఆయనకు భార్య ధనలక్ష్మి, ముగ్గురు కొడుకులు ఉన్నారు.ముగ్గురు కుమారులకు వివాహం అయింది. మొదటి కొడుకు వాసుబాబు నగరంలోని ఎండాడలో నివసిస్తున్నాడు. రెండో కొడుకు బలరామకృష్ణ, మూడో కొడుకు శ్రీనివాస్ కుటుంబాలతో కలిసి రామానుజమ్ ఈ ఇంట్లో నివసిస్తున్నారు. మూడో కొడుకు శ్రీనివాస్ రెండు రోజుల కింద వృత్తి రీత్యా క్యాంపు వెళ్లాడు. అతని భార్య కూడా కొన్ని రోజుల కిందట పుట్టింటికి వెళ్లింది. ప్రస్తుతం ఇంట్లో రామానుజం దంపతులు, రెండో కొడుకు బలరామకృష్ణ, అతని భార్య పిల్లలు ఉంటున్నారు. ఆదివారం రాత్రి 11.30 గంటల వరకు అందరూ మేల్కొనే ఉన్నారు. ఆ తర్వాత బెడ్ రూముల్లోకి వెళ్లి నిద్రించారు. ఆ తర్వాత దొంగలు వంటగది ద్వారానికి ఉన్న ఇనుప సేఫ్టీగ్రిల్ తాళం విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. హాల్లో ఉన్న బీరువాలో భద్రపరిచిన 10 తులాల బంగారం, అరకిలో వెండి దొంగిలించారు. ఉదయం ధనలక్ష్మి లేచి వంటగదిలోకి వెళ్లి చూడగా తలుపు తెరచి ఉన్నాయి. హాల్లో బీరువాలు తెరచి ఉండడంతో విషయాన్ని భర్తకు, కొడుకు చెప్పింది. దీంతో రామానుజమ్ గోపాలపట్నం క్రైం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుఉన్న క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సూర్యనారాయణ పరిశీలన జరిపారు. క్లూస్టీమ్ ఆధారాలు సేకరించింది. 10 తులాల బంగారం, అరకిలో వెండి పోయినట్టు రామానుజమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పందనకు 11 వినతులు



సమస్యను జెడ్సీకి వివరిస్తున్న చందుయాదవ్

పెందుర్తి: జీవీఎంసీ జోన్-8 వేపగుంటలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పలు సమస్యలపై మొత్తం 11 వినతులు వచ్చాయి. అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ కె.హైమావతికి ఫిర్యాదు చేశారు. పురుషోత్తపురంలోని శ్మశాన వాటిక సమీపంలో కొందరు వ్యక్తులు వ్యర్థాలు పడేయడం వల్ల స్థానికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని వైఎస్సార్సీపీ నేత చందుయాదవ్ జెడ్సీకి ఫిర్యాదు చేశారు. ఆయా సమస్యలపై తక్షణమే స్పందించాలని వివిధ శాఖల అధికారులకు జెడ్సీ సూచించారు.

నమో శివరుద్రాయ

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుడి కుటుంబ సభ్యులకు తక్షణ సాయం అందిస్తున్న నాయుడు

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో బైలపూడి ముత్యాలనాయుడు(25) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్రాజ్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించి రూ.లక్ష వైఎస్సార్ బీమా వర్తించేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బీమాకు దరఖాస్తు చేయడంతో రూ.1 లక్ష మంజూరు అయింది. అందులో తక్షణ సాయంగా మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేల నగదును సోమవారం వైఎస్సార్సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఐడీ బాబు,వెల్ఫేర్ అసిస్టెంట్ రేష్మా ప్రవల్లిక, వలంటీర్ శాంతమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సబ్బవరం: చిన్నారులకు తగిన పౌష్టికాహారం అందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి అన్నారు. సబ్బవరం కోమటివీధిలోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొని గర్భిణులు,బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారుల్లో 2 సంవత్సరాల్లోనే మెదడు 80 శాతం వరకూ వృద్ధి చెందుతుందన్నారు. పిల్లల పెరుగుదలకు కనీసం సంవత్సరం పాటు తల్లి పాలు అందించాలని సూచించారు. వార్డు మెంబర్ కొల్లి కృష్ణ,అంగన్వాడీ సూపర్ వైజర్లు ఆర్ .పైడితల్లి, సీహెచ్ స్వర్ణలత,వై. ఇందిర పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి సందడిగా భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్రాజ్, లబ్ధిదారులు

పెందుర్తి: మండలంలోని చింతగట్ల పంచాయతీలోని జగనన్న కాలనీకి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్రాజ్ సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిరుపేద సొంత ఇంటిలో ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆశయం అన్నారు. స్థలం పొందిన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. మొత్తం 110 మంది లబ్ధిదారులతో కలిసి పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అయ్యారక వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, ఎంపీపీ మధుపాద నాగమణి, సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు, పంచాయతీ పాలకవర్గ ప్రతినిధులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళా శక్తితోనే దేశం ముందడుగు

ఫార్మాసిటీ ఎండీ లాల్కృష్ణ



ప్రసంగిస్తున్న ఫార్మాసిటీ ఎండీ లాల్కృష్ణ

పరవాడ: మహిళలు వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్నారని విశాఖ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి.లాల్కృష్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాంకీ హబ్లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎండీ లాల్కృష్ణ ప్రసంగించారు. మహిళా శక్తితోనే దేశం ముందడుగు వేస్తుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి.రామిరెడ్డి మాట్లాడుతూ మహిళలను మించిన ప్రేరణ శక్తి మరొకటి లేదన్నారు. కళా ఆస్పత్రి ఎండీ కళావతి మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న గౌతమి, ఎం.దుర్గామణి, బి.అనూష, మేరీ సువార్త, వెన్నల శశికళ, బి.శ్రీదేవి, రాజేశ్వరి, కె.సరస్వతి, పి.హైమావతి, వై.భాను, ఎం.వి.సునీత, సుజాతలతో పాటు రాంకీ సంస్థకు చెందిన 11 మంది ఉద్యోగులకు రాంకీ ఎంపవరింగ్ విమెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విశ్వనాథ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, ఫార్మాసిటీ ప్రతినిధులు ఎర్రయ్య, గిరిధర్భక్షి, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి, రాజేశ్వరి పాల్గొన్నారు.

పరవాడలో పోలీసుల కవాతు



పరవాడలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

పరవాడ: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రజలు సహకరించాలని సీఐ ఎస్.బాలసూర్యారావు కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీఆర్పీఎఫ్ బలగాలు, స్థానిక పోలీసు సిబ్బంది సంయుక్తంగా పరవాడలో సోమవారం కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలపై సీఐ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ సిరపరపు సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.